క్లుప్తంగా

ఆకట్టుకున్న గాన గంధర్వ మణిహారం

విజయవాడ కల్చరల్: నాద వినోదా మ్యూజిక్ (యూఎస్‌ఏ) అకాడమీ, జాషువా సాహిత్య వేదిక, సుమధర కళానికేతన్, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం ఆధ్వర్యంలో నూతన సంవత్సం వేడుకల సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రవాసాంధ్ర గాయని మణి శర్మ ఆధ్వర్యంలో చంద్రతేజ, వినోద్ బాబు, శేషకుమారి ఆ పాత మధురాలను మధురంగా గానం చేశారు. గాయని మణి శాస్త్రి మాట్లాడుతూ తెలుగు వారి ప్రతిభను చాటేందుకు అమెరికాలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. గోళ్ల నారాయణరావు, నారాయణ పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.సత్యవతి సోమవారం తీర్పు చెప్పారు. విజయవాడ కొత్తూరు తాడేపల్లిలోని తాళం వేసి ఉన్న ఇంట్లో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లికి చెందిన భూక్యా రామచంద్రరావు గత ఏడాది జూలై 18వ తేదీన దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత కొత్తపేట స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి రెండు రోజుల తరువాత నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ. 7 వేలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రామచంద్రరావుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, రైతాంగ హక్కుల సాధనకు ఏప్రిల్ 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎస్) అఖిల భారత నాయకుడు విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చలో ఢిల్లీ విజయవంతానికి రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను అరికట్టకపోతే దేశ భవిష్యత్తే ప్రమాదం ముంచుకొస్తుందన్నారు. హక్కుల సాధన కోసం ఢిల్లీలో ఏప్రిల్ 5న జరిగే మహాప్రదర్శన, నిరసన సభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సదస్సు పలు తీర్మానాలు చేసింది. సదస్సులో సీఐటీయూ నాయకుడు ఎం.ఎ.గఫూర్, ఏఐఏడబ్ల్యూయూ నాయకుడు బి.వెంకట్ మాట్లాడారు.

గుంటూరులో విజయవాడ వాసి మృతి

గుంటూరు ఈస్ట్: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం గత నెల 25వ తేదీ సెయింట్ జోసఫ్ హాస్పిటల్ మెయిన్ గేటు ఎదురుగా ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని పరిశీలించి అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా విజయవాడ, గాంధీనగర్‌కు చెందిన జి.రంగారావు (48)గా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇప్పటివరకు అతని అడ్రస్సు వివరాలు తెలియరాలేదు. సమాచారం తెలిసిన వారు 86888 31336కు ఫోన్ చేయాలని కోరారు.

12న ముగ్గులపోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో ఈనెల 12వ తేదీన గుడిపాటి దత్తు, గుడిపాటి సీతారామ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ బీ జానారెడ్డి సహకారంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక బహుమతులు, ఐదు కన్సొలేషన్, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు బాబూరావు మేడ సెంటర్‌లోని గుడిపాటి దత్తు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. 40 సంవత్సరాలుగా మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే విధంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు 98855 81579లో సంప్రదించాలని తెలిపారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లి అదృశ్యంపై నున్న పోలీసు స్టేషన్లో సోమవారం ఫిర్యాదు అందింది. పాయకాపురం, ఏపీఎస్ రెడ్డి రోడ్డులో ఉంటున్న కొక్కలవ్య హేమలత డ్వాక్రా మహిళా సంఘం ప్రెసిడెంటుగా పనిచేస్తోంది. 9వ తేదీ ఉదయం 5గంటలకు వాకిట్లో ముగ్గువేసిన అనంతరం ఆమె కనిపించలేదు. ఒత్తిడికి తట్టుకోలేక వెళ్లిపోతున్నట్టు డైరీలో రాసింది. ఆమె కుమారుడు ఉదయ్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధిలో సీఎం జగన్‌కు మరెవరూ సాటిరారు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరెవరూ సాటిరారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సోమవవారం 23వ డివిజన్‌లో రూ.95.90 లక్షల వ్యయంతో గోవిందరాజులనాయుడు వీధి, విష్ణువర్ధన్‌రావు వీధి, నరసింహానాయుడు వీధిలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులన మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావుతో కలిసి ఎమ్మెల్యే విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. రోడ్లు, డ్రైయిన్లు, తాగునీరు ఇలా మెరుగైన సేవలందిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.76.10 లక్షల వ్యయంతో గోవిందరాజులనాయుడు వీధి, విష్ణువర్ధన్‌రావు వీధుల్లో సీసీ రోడ్లు, రూ.19.80 లక్షల వ్యయంతో నరసింహానాయుడు వీధిలో సీసీ రహదారిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీని ద్వారా సుమారు 1,100 కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గత మూడున్నరేళ్లలో డివిజన్లో రూ. 3.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వీటిలో రూ. 1.25 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ. 1.36 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. మరో రూ. 63 లక్షలతో పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 14వ ఆర్థిక సంఘం నిధులలో అట్లా రత్తయ్య, శివాలయం వీధుల్లో రహదారులను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రకాశం రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డు, గవర్నర్ బంగ్లా రోడ్డు, కస్తూరిబాయిపేట పుష్ప హోటల్ సెంటర్ నుంచి జంక్షన్ వరకు రహదారులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, స్థానిక కార్పొరేటర్ బాలస్వామి, డివిజన్ కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీ, నాయకులు ఆత్మకూరి వెంకట అప్పారావు, చల్లా సుధాకర్, శేషన్ మురళి, పండు, పసుమర్తి రాజేష్, కొల్లిపర శ్రీను, యర్రంశెట్టి అంజిబాబు, శివారెడ్డి పాల్గొన్నారు.

పేదల ఉన్నతికి సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఉన్నతికి ఎంతగానో దోహదపడుతున్నాయని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 25వ డివిజన్ 96వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలదేవి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఎమ్మెల్యే విష్ణు జానీ వీధి, రెహమాన్ వీధి, హుస్సేన్ సాహెబ్ వీధి, దాసు వారి వీధి, మౌలానా వీధి, నజరుల్లాఖాన్ వీధి, కూర్మయ్య వీధులలో పర్యటించారు. స్థానికుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించారు. హుస్సేన్ సాహెబ్ వీధిలో కల్వర్టు ఎత్తు పెంచి సైడ్ కాలువలో మురుగు పారుదల ఉండేలా చూడాలని వీఎంసీ అధికారులకు సూచించారు. జగనన్న కాలనీలలో పట్టాలు మంజూరైన లబ్ధిదారులకు క్లస్టర్ల వారీగా ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని పొదుపు సంఘాల ఆర్పీలకు సూచించారు.

ప్రజాసంకల్ప యాత్ర పెను సంచలనం

అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర దేశ రాజకీయాల్లోనే ఓ పెను సంచలనం అని మల్లాది విష్ణు అన్నారు. రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి కేక్ కట్ చేశారు.

ప్రతిపక్షాలు ఈర్ష్య పడేలా సీఎం జగన్ పాలన

ప్రతిపక్షాలు ఈర్ష్యపడే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మల్లాది విష్ణు అన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన భరోసాను మరింత పెంచేలా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికలకు ఎన్ని పార్టీలు కలిసినా.. వైఎస్సార్ సీపీ ఒంటరిగా తిరుగులేని మెజార్టీతో 175 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు బంకా భాస్కర్, నాగేశ్వరరెడ్డి, బంకా వెంకటేష్, షేక్ రఫీ, నజీర్, అలీ అన్సారీ, భోగాది మురళి, వి.బి.ఆచారి, కోలంటి రవి, మారుతి, మానం గంగాధరరావు, విద్యావతి, చినబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

పౌరాణిక కళారంగాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న శంకరరావు, వేదికపై రామచంద్రరావు

విజయవాడ కల్చరల్: పౌరాణిక కళారంగాన్ని ప్రోత్సహించాలని శారదా కళాసమితి అధ్యక్షుడు డోకిపర్తి శంకర్రావు అన్నారు. శారదా కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో సోమవారం పద్యనాటకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిచారు. శంకర్రావు మాట్లాడుతూ పద్యం తెలుగు వారి ఆత్మగా అభివర్ణించారు. వందలాది నాటకాలు, వేలాది మంది కళాకారులు పద్యనాటక రంగం అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ప్రతినెలా నగరంలో ఒక పద్యనాటకం ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పద్యనాటకోత్సవంలో భాగంగా మయసభ, పాండవోద్యగ పర్వంలోని పడక సీను అంశాన్ని కళాకారులు ప్రదర్శించారు. నాటకరంగ ప్రముఖుడు గణేష్‌కుమార్ సంస్థ కన్వీనర్ ఎంఆర్‌ఎస్ ప్రకాశరావు శారదా కళా సమితి సేవలను వివరించారు. సంస్థ కోశాధికారి గోళ్ల రామచంద్రరావు, కార్యదర్శి వీవీకే నరసింహారావు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక దుర్గాపురంలో సోమవారం జండూ ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయన్నారు. తోటి వారికి సాయం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పాల్గొన్నారు.

అందుబాటులో దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కమర్షియల్ విభాగం దివ్యాంగ్ జన్ రైల్వే రాయతీకి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల కోసం వెబ్ ఆధారిత 'దివ్యాంగ్ జన్ రైల్వే కన్సెషన్ ఐడి కార్డు సిస్టం'ను అభివృద్ధి చేశారు. డిసెంబర్ 22న డివిజన్ వార్షిక తనిఖీల్లో తెనాలి–గూడూరు సెక్షన్ల మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో విజయవాడ డివిజన్ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగులు సమాచారం అందుబాటులో ఉంటుంది. ఐడీ కార్డు కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు పూర్తి చేసి, సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయడం ద్వారా ఐడీ కార్డు సులభంగా పొందవచ్చు. దివ్యాంగుల విలువైన సమయం, భౌతిక ప్రయాణాన్ని తగ్గించడంతో పాటు సులభంగా ఐడీ కార్డులు పొందవచ్చని సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తెలిపారు. అప్లికేషన్ రూపొందించిన డివిజన్ ఐటీ ఉద్యోగులను డీఆర్‌ఎం శివేంద్రమోహన్ అభినందించారు.

రహదారులకు మహర్దశ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రహదారుల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీపేటలో రూ.49.65 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారులను డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవి రాజారమేష్‌తో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 57వ డివిజన్‌లో ఇటీవల చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇక్కడి రోడ్ల దుస్థితిని ప్రత్యక్షంగా వీక్షించి యుద్ధప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను చేపట్టామన్నారు. పద్మావతి ఎన్‌క్లేవ్, లక్ష్మీ ఎన్‌క్లేవ్ రహదారులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసుకున్నట్లు తెలిపారు. గడిచిన మూడేళ్లలో ఈ డివిజన్‌లో రూ.3.69 కోట్ల అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్పొరేషన్ డీఈ గురునాథం, వైఎస్సార్ సీపీ నాయకులు కాళ్ల ఆదినారాయణ, చెన్నకేశవ రెడ్డి, చెన్నారెడ్డి, బాల, ప్రేమ్‌కుమార్, పఠాన్ నజీర్‌ఖాన్, నెల్లి గోవింద్‌నాయుడు, శ్రీనివాస్, బేగం, రజియా పాల్గొన్నారు.

ప్రగతి, సంక్షేమానికి పునాది ప్రజాసంకల్పయాత్ర



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్పయాత్ర ప్రగతి, సంక్షేమానికి పునాది అని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక సత్యనారాయణపురం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రజా సంకల్ప యాత్ర ముగిసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన భారీ కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పట్లో నిర్వహించిన పాదయాత్రలో చూసినవి, విన్నవి ఆకలింపు చేసుకుని సీఎం అయిన అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా పేదల జీవితాలలో నూతన వెలుగులు ప్రసరింప చేశారన్నారు. నేడు దేశం యావత్తూ రాష్ట్రం వైపు చూస్తోందన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యం

ఎంత మంది కలిసినా, ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజల మనస్సులలో చిరస్మరణీయ స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎం కావడం తథ్యమని డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. జగన్‌పాలన రామరాజ్యం అని ఆయన ఎక్కడ అడుగు పెడితే అక్కడ సంక్షేమం వెల్లివిరుస్తుందని, వర్షాలు పడతాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, నాయకులు కమ్మిలి రత్నకుమార్, 61 డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, గుడిపాటి దత్తు, సామంతపూడి చిన్నా, రణదేవ్, స్వామి, ఎం.కోటి పాల్గొన్నారు.

13 నుంచి అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీపతి, శరాబంధీరావు, బచ్చామేస్త్రి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకలలో ప్రజలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి పేర్కొన్నారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావుతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 18వ తేదీవరకు నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలను విజయంతం చేయాలని సూచించారు. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ ఉదయం 5.30 గంటలకు అమ్మవారి సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వార్షికోత్సవంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ చిగురుపాటి వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. నాయకులు బచ్చా మేస్త్రి పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు ముందు తరాలకు అందించాలి



వివేకానంద స్ఫూర్తి అవార్డులు అందుకున్న వారితో ఏఎండీ ఇంతియాజ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతీయ యువతను అద్భుతంగా ప్రభావితం చేసిన స్వామి వివేకానందుని బోధనలు, భావాలు ముందు తరాలకు అందించాలని ఏపీ మైనారిటీ శాఖ ముఖ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నలంద డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవకులకు స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డులను అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇంతియాజ్ తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయాలతో పాటు, వివేకానందుని విశాల దృక్పథమే ఆయన రచనలు, ఉపన్యాసాలలో ప్రతిఫలిస్తుందన్నారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వరరావు(విజయవాడ), డి ఆంజనేయప్రసాద్(హైదరాబాద్), ఎస్ రవీంద్రారెడ్డి (పలమనేరు), వై శ్రీలక్ష్మి(విజయవాడ), షేక్ రఫీయాబేగం(విజయవాడ)ను సత్కరించి అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వేముల హజరత్తయ్య గుప్తా, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేన్ అధ్యక్షుడు కె మురళీమోహన్‌రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

గోదా రంగనాథుడికి ముత్యాల హారతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ మండలి, ముత్యాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ధనుర్మాసోత్సవాలలో భాగంగా గోదా రంగనాథుడికి ముత్యాల హారతులు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం స్వామికి ముత్యాల హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పారాయణ మండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి మాట్లాడుతూ ధనుర్మాసంలో ఆండాళ్ తల్లి ధనుర్మాస వ్రతంలో ప్రతి రోజూ గోపికలందరినీ మేల్కొలిపి రంగాథుడి అనుగ్రహానికి పాత్రులు అయ్యిందన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని గోదా రంగనాథులకు ముత్యాలహారతులు ఇచ్చారు. అనంతరం ముత్యాల శ్రీనివాసరావు దంపతులచే వెంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది.

జూదరులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక మీనాక్షి నగర్లో బహిరంగ ప్రదేశం నందు పేకాడుతున్న ఎనిమిది మందిని నున్న పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకుని వారి పై కేసు నమోదు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై గోవిందు సిబ్బందితో వెళ్లి పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారి వద్ద నుంచి రూ.25వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్నేహితుడి ఇంటికి వెళ్లి అతని భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా, చంపేస్తానంటూ బెదిరించిన వ్యక్తిపై భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం శంకరమఠానికి చెందిన కోడె గిరిబాబు, మదన్ ఇద్దరూ స్నేహితులు. లారీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. మదన్ తరచూ గిరిబాబు ఇంటికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మదన్ మద్యం సేవించి గిరిబాబు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి వద్దనే ఉన్న గిరిబాబు భార్యతో అసభ్యకరంగా మాట్లాడాడు. ఆమె పక్కింటిలోకి వెళ్లినా వదిలిపెట్టకుండా వెంటాడి ఆమె డ్రెస్ చించివేశాడు. గిరిబాబు భార్య హారిక భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మదన్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో సమస్యలను అధికారులు పరిష్కారదశగా చర్యలు తీసుకోవాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్‌కంట్రోల్ రూంలో జరిగిన స్పందనలో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నగరపాలక సంస్థ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులపై అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డా.కె.బి.ఎన్.ఎస్ లతా, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాల్లో..

జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సర్కిల్-3 కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం-1, పట్టణ ప్రణాళికవిభాగం-1 అర్జీ, సర్కిల్ -2, సర్కిల్-1 కార్యాలయంలో ఎటువంటి అర్జీలు అందనట్లు జోనల్ కమిషనర్ తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేస్తాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసి, బీసీల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని ఆ సంక్షేమ సంఘం రాష్ట కన్వీనర్ బోను దుర్గ నరేష్ అన్నారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య సూచనల మేరకు పని చేస్తామని పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట కన్వీనర్ బోను దుర్గ నరేష్ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు ఏ విధంగా పని చేయాలి? బీసీల సమస్యల పై ఏ విధంగా పోరాడాలి అనే దానిపై సంఘం ముఖ్య నేతలతో జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సమావేశమైనట్లు చెప్పారు. సంఘంలో పదవులు తీసుకుని సంఘం కోసం పని చేయకపోతే వారిని పదవులు నుంచి తప్పించనున్నట్లు హెచ్చరించారు. ఈ నెల 17వ తేదీన పాలకొల్లులో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీల సంక్షేమానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మెండి జ్యోతిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో నగర షూటర్లు సత్తా



షూటర్లను అభినందిస్తున్న డీవీఈఓ, ఆర్ఐఓ

విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ అండర్–19 రాష్ట స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో విజయవాడ షూటర్లు సత్తా చాటారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఈ పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహించిన ఎం.గోపిక పీప్‌సైట్ బాలికల విభాగంలో, బి.కావ్యనాగిని పిస్తోల్ బాలికల విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించారు. అదేవిధంగా బి.నిశిత పీప్‌సైట్ బాలికల విభాగంలో, సీహెచ్.ప్రణీత్ పీప్‌సైట్ బాలుర విభాగంలో, కె.యశ్వంత్ పిస్తోల్ బాలుర విభాగంలో సిల్వర్ మెడల్‌ను, కె.శ్రీవత్సవ పీప్‌సైట్ బాలుర విభాగంలో, సేక్ సాల్మా పీప్‌సైట్ బాలికల విభాగంలో బ్రాంజ్ మెడల్‌ను దక్కించుకున్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించడమే కాకుండా రాష్ట జట్టులో స్థానం దక్కించుకుని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా డీవీఈఓ సి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ఆర్ఐఓ పి.రవికుమార్, స్కూల్ గేమ్స్ అండర్–19 జిల్లా కార్యదర్శి వి.రవికాంత అభినందించారు.

సమాజసేవలో భాగస్వాములుకావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు సమాజసేవలో భాగస్వాములు కావాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. మురుగా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో చారిటబుల్ సంస్థ సభ్యుల అవగాహన సమావేశం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ మురుగా చారిటబుల్ సంస్థ దివ్యాంగుల కోసం సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. చారిబుల్ సంస్థ చైర్మన్, సినీ దర్శకుడు రమాశంకర్ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. సంస్థ ద్వారా యువ కళాకారులను పరిచయం చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సాహితీ సంస్థలు ప్రతినిధులు పరచూరి విజయలక్ష్మి, మాంతి రమణ, దండు చంద్రశేఖర్, జిలానీఖాన్, జ్ఞానకిషోర్ పాల్గొన్నారు.